# 'కౌడంగోపాఖ్యానం అను పేడ కథ'

భారతీయులింక అణ్వాయుధాల దాడి గురించి భయపడవలసిన అవసరం లేదు. ఎందుకంటే అణ్వస్త్రాల నుంచి మనల్ని కాపాడే కవచం మన దగ్గరుంది. ఆ కవచమేమిటో తెలుసా! గోమయం. అవునండీ అక్షరాలా ఆవుపేడే.

'ఆవుపేడేమిటీ, అణ్వాయుధాల్నించి మనల్ని రక్షించడమేమిటీ, అనుకుంటున్నారా? అయితే మీరు అగ్గినానులన్నమాటే. ఈ స్టేట్‌మెంటిచ్చింది ఉత్తరప్రదేశ్ 'గోసేవా ఆయోగ్' అనే సంస్థ ఛైయిర్‌మెన్‌గారు ఆర్.ఎస్.గుప్తాగారి ప్రకారం 'మన హైందవ పురాణాల్లో దీని గురించిన ఆధారాలు కోకొల్లలుగా ఉన్నాయి. కావాల్సిందల్లా కాస్త 'సైంటిఫిక్ రీసెర్చి' అని ఆయన స్టేట్‌మెంటిచ్చేసి వూరుకున్నారా ఏమిటి. పశుసంవర్థక శాఖామాత్యులు మాన్యశ్రీ ఎల్.కె. బాజపేయిగారిని ఒప్పించేసి ఆవుపేడ సేంపిల్సును భాభా అటామిక్ రీసెర్చి కేంద్రానికి పంపించే ప్రయత్నాల్లో వున్నారు. అందువల్ల మనం ధన్యజీవులమై అతి త్వరలో మనమన ఇళ్లకు అణ్వాయుధ రక్షణ కోటింగ్‌గా స్పెషల్ ఆవు పేడను కొనబోతున్నాము.

ఏమిటీ చోద్యమనుకుంటున్నారా చూ: 'వీక్' వారపత్రిక తే. 19 జనవరి.

సర్సరే... ఆవుపేడా అణ్వాయుధ రక్షణా బానే వుందికానీ... సంబరంగా సంకురాత్రొచ్చి వెళ్లిపోయింది. ముగ్గులేయడానికి గొబ్బెమ్మలు పెట్టడానికి నారీలోకం పడిన హడావుడి అంతాఇంతా కాదు. కళ్లాపి చల్లడానికి పేడ కావాలి. గొబ్బెమ్మలు చేసి పెట్టుకుందుకీ పేడ కావాలి కనుక గోమయాన్వేషణ.

పనిమనుషుల్ని బతిమాలి. బామాలి పేడ తెప్పించుకోవాలి. వాళ్ళేమో మామూలు గానే మహరాణులు... ఇక వాళ్ళని బామాల్సొస్తే...! మజ్జారే చూడండీ...! (అయ్యా, అమ్మా, ఇది నగరవాసుల గొడవ మాత్రమే. పల్లెలకింకా ఆ దుర్గతి పట్టలేదు లెండి)

ఇదికూడా చిన్నా చితగా ఇళ్లుండీ (అద్దెవే అయినా) ఆ ఇళ్లముందు ముగ్గుకు కాస్త జాగా ఉంటేనే... అపార్ట్‌మెంట్‌వాసుల కోసం ఈ మధ్య టీవీ చానెళ్లవాళ్లూ, ఇంకొన్ని వ్యాపార సంస్థల వాళ్లూ... పిల్లల ప్లే గ్రౌండ్లలో ముగ్గుల పోటీలు పెట్టారులెండి. (ఇది గత నాలుగైదేళ్లుగా జరుగుతోందని నా అభిప్రాయం.) అక్కడ ప్లే గ్రౌండ్లో ఒక్కోళ్లకీ ఓ గడీ, దానికో నెంబరూ ఇచ్చేసి వాళ్లవాళ్ల రంగవల్లీ రచనా కళాకౌశలాన్ని ప్రదర్శించమని...

అందులో ఓ ముగ్గురికి బహుమతులను ఇచ్చి ప్రోత్సహిస్తారు. ముగ్గుల గురించి ప్రతిసారీ సంక్రాంతి స్పెషల్స్‌గా వచ్చే పత్రికల్లో కార్టూన్లు మామూలే. ముఖ్యంగా రథం ముగ్గు గురించి.

చిన్నప్పుడు మా అక్కయ్యలు చుట్టుపక్కల ఇళ్లవాళ్లతో పోటీపడేవాళ్లు. మా రథం పెద్దదంటే మా రథం పెద్దదని, ఈ మధ్యన మా కర్నూల్లో వైకుంఠ రథమని ఒకటి వెలసింది లెండి. ఇదే రథం అనుకుంటున్నారా! భూకబ్జాల్లో శ్మశనాలు కూడా వున్నాయి కదండీ... వూరి మధ్యన వున్న శ్మశానాలు మింగబడి వూరికి దూరంగా వెలిశాయి. అంచేత ఎవరైనా 'హరీ'మంటే అంతంతదూరం మోతకి శవవాహకులకు ఇచ్చే పైకం మోత అవుతుందని ఎవరో ధర్మాత్ములు ఓ చక్రాలబండి చేసి పెట్టారు. దాని పేరే 'వైకుంఠ రథం' ఇప్పుడు ప్రతీ ఊళ్లోనూ వైకుంఠ రథాలున్నాయి లెండి. (ఇది రామాయణంలో గొబ్బెమ్మల వేట లెండి. ముగ్గుల్లో రథం ప్రసక్తితో గుర్తొచ్చింది.)

ఇంతకీ మనం పేడ గురించి కదండీ మాట్లాడుకుంటున్నాం.

మన నగరాల్లో, పట్టణాల్లో పేడెక్కడ దొరుకుతుందండీ, గేదెలంటూ కనబడితే పూర్తిగా రద్దీగా వుండే మెయిన్ రోడ్డు మధ్యలో హెవీట్రాఫిక్కులో దివ్యంగా సుఖాసీనమై దర్శనమిస్తాయి. అవి పేడవేసినా గీసినా ఆ రద్దీలో పేడ తట్టెత్తుకుని గోమయ సేకరణ చేయడం సాధ్యమా!

ఈ నారీ జన హడావుడీ గడబిడ గమనించేసి ఓ ఢిల్లీవాలా ఓ నిఖార్సైన వ్యాపార సూత్రాన్ని తయారుచేసేశాడు.

'రెడీమేడ్ పేడ పేకెట్'

ఆశ్చర్యపోకండి. పేడను ఎండబెట్టి పొడిచేసి అందులో కొన్ని పరిమళ ద్రవ్యాల్ని కలిపి పాలిథీన్ సంచుల్లో భద్రంగా పేక్ చేసి అమ్మేయడం... వహ్వా... అమోఘం... అద్భుతం. మనం చేయవలసిందల్లా సూపర్‌మార్కెట్‌కి వెళ్లినప్పుడు పప్పు, ఉప్పు, టీ, బిస్కెట్టు ప్యాకెట్లతోపాటు స్టైలిష్‌గా ఓ పేడ పేకెట్ బుట్టలో వేసుకుని తెచ్చేసుకోడమే. ఇంటికొచ్చి ఆ పొడి పేడను తడి చేసేసుకుంటే... పేడ రెడీ.

చూశారా పేడ అని తక్కువగా చేసి చూడకండి.

అణ్వాయుధ రక్షణ కవచంగానూ. వ్యాపారానికి కొత్త మార్గంగానూ వుంటూ భవిష్యత్తులో ఇంకేమి విశేషాలని మనకి తెలియజేస్తుందో...

గోమాతా! నమోనమః గోమయం నీకు జయం! ●